క్లుప్తంగా

రోగులకు పండ్లు పంపిణీ



కంకిపాడు: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా పోరాట సమితి పనిచేస్తుందని సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మువ్వల అన్వేష్ తెలిపారు. సమితి ఆవిర్భావ దినోత్సవం బుధవారం కంకిపాడులో నిర్వహించారు. పట్టణంలోని పలు ప్రధాన ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అన్వేష్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధన, ప్రజా సమస్యల పరిష్కారమే కర్తవ్యంగా సమితి పనిచేస్తుందని వివరించారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర కార్యదర్శి బట్టు నాగరాజు, నాయకులు సిరివెళ్ల చిట్టిబాబు, వర్రె భానుప్రకాష్, రోహిత్‌పూర్ణ, రాము, రఘు, ఎంపీటీసీ కోనా కిషోర్ పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీల్లో వీఆర్ గెలుపు



పెనమలూరు: జేఎన్‌టీయుకే యూనివర్సిటీ ఇంటర్ కాలేజీ బాస్కెట్‌బాల్ పోటీల్లో కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ మహిళల జట్టు గెలుపొందింది. ఈ మేరకు బుధవారం కాలేజీలో జరిగిన కార్యక్రమంలో క్రీడాకారులను కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్ అభినందించారు. పీడీ పోతిన రఘు తెలిపిన వివరాల ప్రకారం గత నెల 28, 29 తేదీల్లో మైలవరం లక్కిరెడ్డి బాలిరెడ్డి కాలేజీలో ఇంటర్ కాలేజీల బాస్కెట్‌బాల్ పోటీలు జరిగాయన్నారు. తమ కాలేజీ మహిళల జట్టు రెండవ స్థానంలో గెలిచారన్నారు. యూనివర్సిటీ జట్టుకు తమ కాలేజీ విద్యార్థినులు ప్రణీత, మహిమాన్విత ఎంపిక య్యారన్నారు.

పెనమలూరు సొసైటీ అధ్యక్షుడిగా కొత్తపల్లి



పెనమలూరు: పెనమలూరు సొసైటీ (పీపీఎస్) అధ్యక్షుడిగా కొత్తపల్లి వెంకటేశ్వరరావును నియమిస్తూ గుడివాడ డెప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్ డి.విజయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత సొసైటీ పాలక వర్గం గత నెల 30 తేదీన ముగియటంతో కొత్త పాలక వర్గాన్ని నియమించారు. సొసైటీ చైర్‌పర్సన్‌గా కొత్తపల్లి వెంకటేశ్వరరావు, సభ్యులుగా వడుగు సర్వేశ్వరరావు, దాసరి సాయిబాబును నియమించారు. కొత్త పాలక వర్గం గడువు వచ్చే ఏడాది ఏప్రిల్ నెల 30 వ తేదీ వరకు ఉంటుంది. వెంకటేశ్వరరావు తాత వెంకటేశ్వరరావు 1952–1959 కాలంలో సొసైటీ అధ్యక్షుడిగా సేవలు అందించారు. 75 సంవత్సరాల తరువాత ఆయన మనవడు కొత్తపల్లి వెంకటేశ్వరరావు సొసైటీ అధ్యక్షుడిగా పదవి వరించింది.

కంటి సంరక్షణకు చర్యలు



కంకిపాడు: కళ్ల సంరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఉప్పులూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుందర్‌కుమార్, వైద్యులు సుధా ప్రసూజ అన్నారు. ఉప్పులూరు పీహెచ్‌సీ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో కంటి సమస్యలను ఎదుర్కొంటున్న రోగులను గుర్తించి బుధవారం ఉయ్యూరు రోటరీ కమ్యూనిటీ సర్వీస్ ట్రస్టుకు శస్త్ర చికిత్స నిమిత్తం తరలించారు. ఈ సందర్భంగా వైద్యులు సుందర్ కుమార్, సుధా ప్రసూజ మాట్లాడుతూ అన్ని వయస్సుల వారికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందు వైద్య శిబిరాల్లో అందించామని చెప్పారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారికి నాణ్యతా ప్రమాణాలతో కూడిన వైద్యం అందించే లక్ష్యంతో ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా వైద్య సేవలు అందేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో ఆప్తాల మిక్ ఆఫీసర్ వివి రాజేష్‌కుమార్, ఎంపీహెచ్‌ఈఓలు కృష్ణారావు, శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ రామారావు, హెల్త్ అసిస్టెంట్ రాచమళ్ల శ్యాం ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాజు

కంకిపాడు: మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండలంలోని కుందేరు గ్రామానికి చెందిన గోగులమూడి రాజు నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్ కుమార్ చేతులమీదుగా నియామకపత్రాన్ని బుధవారం అందుకున్నారు. ఈ సందర్భంగా రాజు కంకిపాడులో విలేకరులతో మాట్లాడారు. గుంటూరు పట్టణంలోని మాల మహానాడు రాష్ట్ర కార్యాలయంలో ముఖ్యబాధ్యుల సమావేశం బుధవారం జరిగిందన్నారు. ఈ మేరకు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తనను నియమిస్తూ నియామక పత్రం అందించారన్నారు. అంబేడ్కర్ ఆలోచనా విధానంతో, మాల మహానాడు బలోపేతానికి, చర్యలు తీసుకుంటామని చెప్పారు. దళితుల అభ్యున్నతికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పిల్లి మేరీ, ధార హేమప్రసాద్, వర్రె చిట్టిబాబు, సరిహద్దు ఆంటోని పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'సాక్షి' మ్యాథ్స్‌బీ పరీక్ష



సంవిధ విద్యపీఠ్ స్కూల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు



గూడవల్లి కె.కె.ఆర్ గౌతమ్ స్కూల్‌లో..

- సాక్షి మీడియా ఆధ్వర్యంలో నిర్వహణ
- నాలుగు కేటగిరిల్లో విద్యార్థులకు పరీక్షలు
- విద్యార్థుల నుంచి విశేష స్పందన
- విజయవాడ నగరంతో పాటు జిల్లాలోని పలు స్కూళ్లలో నిర్వహణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): సాక్షి మీడియా గ్రూపు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మ్యాథ్స్‌బీ పరీక్ష ఉత్సాహంగా జరిగింది. మ్యాథ్స్‌బీ పరీక్ష విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టింది. మ్యాథ్స్‌లో విద్యార్థుల్లో ఉన్న భయాన్ని పోగొట్టి వారిలో సబ్జెక్ట్‌పై మక్కువ పెంచడానికి విద్యార్థులకు ఈ పరీక్షలను నిర్వహిస్తున్నారు. విద్యార్థులు వారు చదువుతున్న తరగతిని బట్టి నాలుగు కేటగిరీలుగా విభజించి ఈ పరీక్షను నిర్వహించారు. పాఠశాల స్థాయిలో జరిగిన ఈ పరీక్షకు విజయవాడ నగరంలోని ప్రైవేట్ పాఠశాలలతో పాటు నగర పరిసర ప్రాంతాల్లో స్కూళ్లకు చెందిన విద్యార్థులు ఈ పరీక్షలో ఉత్సాహంగా పాల్గొని వారిలోని ప్రతిభను ప్రదర్శించారు. లెక్కల సబ్జెక్ట్ అంటే తమకు 'లెక్క' లేదని నిరూపించారు. ఈ పరీక్షలో ప్రతిభ చూపిన వారికి జిల్లా, రీజనల్, రాష్ట్ర స్థాయిలో పరీక్షను నిర్వహిస్తారు.

మ్యాథ్స్‌బీ పరీక్ష జరిగిన పాఠశాలలు

కానూరులోని కేసీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో–96 మంది, డాక్టర్ కేకేఆర్ గౌతమ్ స్కూల్‌లో–387 మంది, భవానీపురంలోని సెయింట్ జాన్స్ స్కూల్‌లో–108 మంది, బందరురోడ్డులో సెయింట్ జాన్స్ స్కూల్‌లో 53 మంది, మొగల్రాజపురంలోని వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో 99 మంది, కానూరులో షామ్‌రాక్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 118 మంది, సత్యనారాయణపురంలోని సెయింట్ జాన్స్ స్కూల్‌లో 103 మంది, ఆగిరిపల్లిలోని హ్యాపీ వ్యాలీ స్కూల్‌లో 81 మంది, పోరంకిలోని సంవిధ విద్యాపీఠ్‌లో 38 మంది, 5వ నంబరు బస్సు రూట్‌లోని డాక్టర్ కేకేఆర్ గౌతమ్ స్కూల్‌లో 107 మంది, గాయత్రినగర్‌లోని నలంద విద్యానికేతన్‌లో–85 మంది, నలందా హైస్కూల్‌లో 14 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

లెక్కలపై భయం తగ్గింది



సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన మ్యాథ్స్ బీ పరీక్షలో పాల్గొనడంతో లెక్కలపై ఉన్న భయం తగ్గింది. ఈ పరీక్షకు ప్రిపేర్ కావడానికి చాలా సాధన చేశాను. ఈ సాధనలో భాగంగా పరీక్షకు ఎలా ప్రిపేర్ అవ్వాలనే అంశంపై పట్టు సాధించాను.

–భవ్యశ్రీ, 6వ తరగతి, సెయింట్ జాన్స్ స్కూల్, సత్యనారాయణపురం

సబ్జెక్ట్‌పై పట్టు దొరికింది



లెక్కల సబ్జెక్ట్‌పై ఆసక్తి పెరిగింది. సులువుగా లెక్కలను ఏవిధంగా చేయవచ్చు అనే అంశంపై ఈ పరీక్ష ద్వారా అవగాహన వచ్చింది. లెక్కలపై సబ్జెక్ట్‌పై మరింత సాధన అవసరమని తెలిసింది. మ్యాథ్స్‌బీ పరీక్ష ద్వారా చాలా మెలకువ తెలుసుకున్నాను.

–చిత్ర, వీపీ.సిద్ధార్థ స్కూల్, 3వ తరగతి, విజయవాడ

వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ



పెనమలూరులో వృద్ధుడికి పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ కృష్ణకిషోర్



పాతపాడులో పింఛను పంపిణీ చేస్తున్న వలంటీరు ఉదయరెడ్డి



సువర్ణబాయికి పింఛను అందజేస్తున్న వలంటీరు ప్రసన్న

పెనమలూరు: మండల పరిధిలో బుధవారం వైఎస్సార్ పింఛన్ కానుకను వలంటీర్‌లు గ్రామాల్లో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పింఛన్ లబ్ధిదారులు 18,563 మంది ఉన్నారు. వీరికి ప్రభుత్వం రూ.5,16,92,500 సొమ్ము మంజూరు చేసింది. మొదటి రోజు దాదాపు 70 శాతం మేరకు పింఛన్లు పంపిణీ చేశారు. పెనమలూరు 3వ సచివాలయం పరిధిలో అనారోగ్యంతో ఉండి మంచం పట్టిన వృద్ధుడు బొంగులూరి రామారావుకు స్థానిక వలంటీర్ కృష్ణ కిషోర్ వెళ్లి పింఛన్ సొమ్ము పంపిణీ చేశాడు.

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లను ఆయా గ్రామాల్లోని అర్హుల ఇంటింటికి వెళ్లి వలంటీర్లు, సచివాలయ సిబ్బంది బుధవారం తెల్లవారుజాము నుంచే పంపిణీ చేశారు. వృద్ధాప్య, ఒంటరి మహిళ, దివ్యాంగ పింఛన్లు కలిపి రామవరప్పాడులో మొత్తం 96 శాతం, ఎనికేపాడులో 90 శాతం, ప్రసాదంపాడులో 93 శాతం, నిడమానూరులో 60 శాతం పంపిణీ చేశారు. మొత్తం 90 శాతం పంపిణీ అయింది.

ఉంగుటూరు: మండల వ్యాప్తంగా 27 గ్రామ పంచాయితీలకు గాను వైఎస్సార్ పింఛను పథకం ద్వారా 8251 మందికి రూ.2.23 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా బుధవారం 5213 మందికి పింఛను అందజేశారు. వెల్దిపాడు గ్రామంలో పింఛన్ల పంపిణీని ఎంపీడీవో శేషగిరిరావు పరిశీలించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలంలోని 14 గ్రామాల్లో బుధవారం75 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశామని ఎంపీడీఓ బి.భార్గవి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం 17276 మంది లబ్ధిదారులకు రూ.4కోట్ల 81లక్షల 5వేల 250 విడుదల చేయగా వాటిలో 13వేల 99 మంది లబ్ధిదారులకు రూ.3కోట్ల 64లక్షల 84వేల 750 మొదటి రోజు పంపిణీ చేశారు.

కంకిపాడు: అనారోగ్యంతో విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న పింఛను లబ్ధిదారురాలికి వలంటీరు విజయవాడ వెళ్లి పింఛను అందించాడు. దావులూరు గ్రామానికి చెందిన ఎర్రగుంట సువర్ణబాయి కొంతకాలంగా అనారోగ్యంతో విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో వైద్యం చేయించుకుంటోంది. పింఛను తీసుకునేందుకు రాకపోవటంతో విషయం తెలిసిన వలంటీరు బట్టు ప్రసన్న విజయవాడ ప్రభుత్వాసుపత్రికి వెళ్లి పింఛను అందించారు.

పొట్టి శ్రీరాములుకు నివాళి



పోరంకిలో ప్రసంగిస్తున్న కమిషనర్ ప్రకాశరావు



పోరంకిలో పొట్టి శ్రీరాములు విగ్రహం ఆవిష్కరించిన వాసవి క్లబ్ సభ్యులు



తేలప్రోలులో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

పెనమలూరు: రాష్ట్రం అభివృద్ధి చెందే విధంగా ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని తాడిగడప మున్సిపల్ కమిషనర్ ఎస్.ప్రకాశరావు అన్నారు. పోరంకిలోని కార్యాలయంలో బుధవారం రాష్ట్ర అవతరణ దినోత్సవం నిర్వహించారు. తొలుత పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమిషనర్ ప్రకాశరావు మాట్లాడుతూ ఎన్నో త్యాగాలు చేయటం వలనే రాష్ట్రం ఏర్పడిందన్నారు.

పెనమలూరు: పోరంకి విజ్ఞాన భారత్ పాఠశాలలో బుధవారం అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని వాసవి క్లబ్ నవనిర్మాణ్ కపుల్స్ సభ్యులు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. వాసవి క్లబ్ గవర్నర్ మాజేటి రామచంద్రరావు విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర అవతరణకు పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలు అర్పించారన్నారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములుకు ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో విజ్ఞాన్ భారత్ పాఠశాల కరస్పాండెంట్ కొడాలి రామశేషాద్రిరావు, క్యాబినేట్ కార్యదర్శి ఆలపాటి ప్రభాకర్, ట్రెజరర్ సత్యనారాయణ, వైస్ గవర్నర్ కొత్త గణేష్‌బాబు, రీజినల్‌చైర్ పర్సన్ నూకల సాంబశివరావు, జోన్ చైర్ పర్సన్ కొలిపర్తి లక్ష్మీదుర్గ, నవనిర్మాణ్ కపుల్స్ అధ్యక్షుడు వెంకట మస్తాన్‌రావు, సభ్యులు పాల్గొన్నారు.

ఉంగుటూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. తేలప్రోలులో జెడ్పీ హైస్కూల్ వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పూల మాలను వేసి నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో శేషగిరిరావు, మండల సిబ్బంది పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలను వేసి నివాళులర్పించారు.

అనాథ ఆశ్రమంలో అన్నదానం



పాతపాడు అనాథాశ్రమంలో భోజనాలు వడ్డిస్తున్న క్లబ్ ప్రతినిధులు

పాతపాడు(విజయవాడరూరల్): లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేదలు, అనాథలకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని లయన్స్ క్లబ్ గవర్నర్ శంకర్‌గుప్తా అన్నారు. విజయవాడ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం పాతపాడు గ్రామంలోని కార్నర్‌స్టోన్ అనాథ ఆశ్రమంలో పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా లయన్స్ డిస్ట్రిక్ట్ 316డి గవర్నర్ శంకర్ గుప్తా అనాథాశ్రమాన్ని పరిశీలించి, అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా లయన్స్ క్లబ్ ఎనలేని సేవలు అందిస్తుందని చెప్పారు. జూబ్లీ క్లబ్ సేవలు మరువలేనివని పేర్కొన్నారు. ఆశ్రమం నిర్వాహకులు స్వామిని శంకర్ గుప్తా అభినందించారు. లయన్స్ క్లబ్ జూబ్లీ అధ్యక్షుడు తోట పద్మనాభరావు మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చాలనే ఉద్దేశంతో సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. పేద విద్యార్థులకు విద్య, వైద్యం అందిస్తున్నామన్నారు. అవసరమైనచోట మొక్కల పెంపకం చేస్తున్నట్లు పేర్కొన్నారు. మిరియాల వెంకటేశ్వరావు, బండి రామ్మోహనరావు, ట్రెజరర్ మాచిరాజు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిరోధం అందరి భాద్యత

గన్నవరం రూరల్: బాల్య వివాహాలు నిరోధానికి అందరూ కృషి చేయాలని ముస్తాబాద సర్పంచ్ వేము రాధాకృష్ణ కోరారు. కమ్యూనిటీ హాలులో బుధవారం నిర్వహించిన బాల్య వివాహాల నిరోధక సమావేశంలో ఆయన మాట్లాడారు. పర్యవేక్షణ కమిటీని బలోపేతం చేయటం ద్వారా బాల్య వివాహాలు నిరోధించవచ్చని పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు ఎస్‌కె మున్ని, చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి కె.లక్ష్మి, మహిళా సంరక్షణ కార్యదర్శి హరిత, క్రాఫ్ కో–ఆర్డినేటర్ ప్రమోద్, పలు స్థానిక ప్రభుత్వ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

గాయపడ్డ వృద్ధురాలి మృతి

కంకిపాడు: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వృద్ధురాలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. ఎస్ఐ కె.సుధాకర్ తెలిపిన కథనం మేరకు... కంకిపాడు పట్టణంలో నివాసం ఉంటున్న పి.జయలక్ష్మి (60) గత నెల 23న తన చిన్న కొడుకుతో కలిసి ద్విచక్రవాహనంపై విజయవాడ వెళ్తుండగా గోసాల సెంటరు సమీపంలో వాహనం అదుపుతప్పి జయలక్ష్మి కిందపడిపోయింది. తీవ్ర గాయాలపాలైన జయలక్ష్మిని వైద్యం నిమిత్తం కంకిపాడుకు తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది.

శిబిరంలో 300 మందికి వైద్య సేవలు



మాట్లాడుతున్న ఎంపీటీసీ సభ్యురాలు బొంతు సరోజిని

నున్న(విజయవాడరూరల్): ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో వైద్య సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీటీసీ సభ్యురాలు బొంతు సరోజిని సూచించారు. నున్న గ్రామం సచివాలయం 2 వద్ద బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు సరోజిని మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి గ్రామంలో ప్రముఖ వైద్యులచే వైద్య పరీక్షలు నిర్వహించి వైద్య సేవలను అందిస్తున్నారన్నారు. సర్పంచ్ కాటూరి సరళ శ్రీనివాస్, ఉప సర్పంచ్ కలకోటి బ్రహ్మానందరెడ్డి, గ్రామ పార్టీ కన్వీనర్ పోలారెడ్డి చంద్రారెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ యర్కారెడ్డి శివకుమారి, వార్డు సభ్యులు అరుణ, సైదాబి, కాటూరి శ్రీనివాసరావు, డాక్టర్ విజయ పార్టీ నాయకులు భీమవరపు శివరామిరెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు. శిబిరంలో డాక్టర్లు 300 మందికి వైద్య సేవలందించారు.

వసతి గృహ విద్యార్థులకు రగ్గులు పంపిణీ



గన్నవరం: స్థానిక సోషల్ వెల్ఫేర్ వసతి గృహంలో బుధవారం ప్రభుత్వం సరఫరా చేసిన రగ్గులను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి చేతుల మీదుగా రగ్గులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాలు సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. చలికాలంలో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ముందుగానే రగ్గులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మహిళా సంఘ ప్రతినిధులు ఈద పద్మ, కూనపరెడ్డి రజనీ, వార్డెన్ పాల్గొన్నారు.

దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు

పెనమలూరు: గోసాల వైకుంఠపురం గ్రామంలో మహిళ పై ఇద్దరు వ్యక్తులు దాడి చేయటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. అవిశెట్టి లావణ్య నాగాయలంకలో భర్తతో ఉంటుంది. ఆమె కుమారుడి పుట్టినరోజు సందర్భంగా గోసాల వైకుంఠపురంలో పుట్టింటికి వచ్చింది. అయితే ఆమె ఇంటి ఎదురు కంకర రాళ్ల గుట్ట ఉండగా పిల్లలు ఆడుకుంటున్నారు. రాళ్ల గుట్ట యజమాని టి.సాంబయ్య, విజయలక్ష్మి వచ్చి మా రాళ్ల గుట్టను ఎందుకు పాడు చేస్తున్నారని తగాదా పెట్టుకున్నారు. ఈ లోగా విజయలక్ష్మి ఇంట్లో నుంచి కారం తెచ్చి లావణ్య, ఆమె కుమారుడి పై చల్లి సాంబయ్యతో కలిసి దాడి చేశారు. ఈ ఘటన పై లావణ్య పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక

హనుమాన్‌జంక్షన్ రూరల్: రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ ఆటల పోటీల్లో బాపులపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. గత నెల 30వ తేదీన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిడమానూరులోని జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన ఉమ్మడి కృష్ణా జిల్లా నెట్‌బాల్ జట్టు సెలక్షన్స్‌లో ఏడుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు తోట వెంకట నాగేశ్వరరావు తెలిపారు. అండర్–14 బాలుర జిల్లా జట్టుకు కొడాలి దీవెనరాజు, బాలికల జిల్లా జట్టుకు నడకుదురు హిమబిందు, వీరంకి హర్షిత ఎంపికయ్యారని చెప్పారు. అండర్–17 బాలుర జిల్లా జట్టుకు జలసూత్రం కృపాసాగర్, వెలివెల మారుతి మహేష్, బాలికల జిల్లా జట్టుకు రామకూరి కావ్యశ్రీ, పిల్లి స్నేహలత ఎంపికయ్యారని వివరించారు. రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ ఆటపోటీల్లో ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు.

ఫిల్టర్ బెడ్స్ నిర్మాణానికి భూమిపూజ



మైక్రోఫిల్టర్ బెడ్స్‌కు భూమిపూజ చేస్తున్న సర్పంచ్ కాటూరి సరళ శ్రీనివాస్

నున్న(విజయవాడరూరల్): సురక్షిత మంచినీరు సరఫరా చేసేందుకు మైక్రో ఫిల్టర్‌బెడ్స్ నిర్మాణానికి బుధవారం గ్రామ సర్పంచ్ కాటూరి సరళ శ్రీనివాస్ భూమిపూజ చేశారు. ఫిల్టర్‌బెడ్స్ సరిగా పనిచేయడక పోవడంతో గ్రామపార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు సమస్యను ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్‌కి తెలియచేశారు. ఫిల్టర్ బెడ్స్ నిర్మాణానికి జలజీవన్ మిషన్ గ్రాంటు రూ.20 లక్షలు మంజూరు చేయించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కలకోటి బ్రహ్మానందరెడ్డి మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, గ్రామ పార్టీ కన్వీనర్ పోలారెడ్డి చంద్రారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు బొంతు సరోజిని, మాజీ సర్పంచి యర్కారెడ్డి శివకుమారి, వార్డు సభ్యులు అరుణ, సైదాబి, కాటూరి శ్రీనివాస్, గ్రామ పంచాయతి కార్యదర్శి జీటీవీ రమణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తెంపల్లిలో పంటలు పరిశీలన



తెంపల్లిలో మినుము పంట పరిశీలిస్తున్న అధికారులు, పాల్గొన్న రైతులు

గన్నవరం రూరల్: సస్యరక్షణ చర్యలతో పంటలు కాపాడుకోవాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏలు కె.జ్యోతి రమణి, కె.శ్రీనివాసరావు రైతులకు సూచించారు. మండలంలోని తెంపల్లి గ్రామంలో వరి, మినుము, వేరుశనగ పంటలను బుధవారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. వరి పంటలో పొడ తెగులు, మానుగాయ తెగులు ఉన్నట్లు రైతులు తెలియజేయగా నివారణ సూచించారు. టిల్ట్ 200 ఎంఎల్ ఎకరానికి నీటితో కలసి స్ప్రే చేయాలని చెప్పారు. దోమ ఎక్కువగా ఉంటే ఒక దుబ్బుకు అత్తార్ 50 గ్రాముల ఒక ఎకరానికి నీటితో కలిపి స్ప్రే చేయాలని సూచించారు. వేరుశనగ పంటలో వేరుకుళ్ళు రాకుండా విత్తన శుద్ధి చేయాలని, ఆకుమచ్చ తెగుళ్ళను దీని ద్వారా అరికట్టవచ్చునని పేర్కొన్నారు. తెగుళ్ళను రాకుండా పలు పరిష్కారాలు సూచించారు. 80 కిలోల పెంట పోగు, 20 కిలోల వేప పిండి, 2 కిలోలు విరిడి కలుపుకుని చెట్టు నీడలో 7 నుంచి 10 రోజులు నీళ్ల చల్లాలని చెప్పారు. ఈ సందర్భంలో భూమిలో తేమ ఉండాలన్నారు. మినుము పంటలో ఈ విధంగా చేయటం వల్ల వేరుకుళ్ళు తెగులు, ఎండు తెగులు, కండపు గజ్జి నివారించటం సాధ్యపడుతుందని వివరించారు. డీఆర్‌సీ ఏవో డి.పద్మజ, గన్నవరం ఏవో ఎన్ ఎల్ తేజశ్వి, వీఏఏ శివనాగరాజు, రఘు, రైతులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో శ్రీకృష్ణ గోకులం దగ్ధం

హనుమాన్‌జంక్షన్ రూరల్: నూజివీడురోడ్డులోని శ్రీకృష్ణ గోకులంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పరిసర ప్రాంతాల్లో పేల్చిన బాణ సంచా వల్ల చెలరేగిన నిప్పు రవ్వలు గోకులం పైకప్పుపై పడటంతో ప్రమాదం సంభవించింది. దీంతో శ్రీకృష్ణుడి దేవాలయం పైకప్పు పూర్తిగా దగ్ధమైంది. గోకులంలోని ఎలక్ట్రికల్ సామగ్రి, ఇతర వస్తువులు కాలిపోయాయి. నిర్వాహకులు ఆవులను హుటాహుటిన బయటకు తరలించి ప్రమాదం నుంచి రక్షించారు. హనుమాన్‌జంక్షన్ అగ్నిమాపక కేంద్రం అధికారి జి.రామ్మోహనరావు నేతృత్వంలో ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరకుని మంటలను అదుపు చేశారు. ఈ అగ్ని ప్రమాదంలో సుమారు రూ.6 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లుగా గోశాల నిర్వాహకులు గొట్టిపాళ్ల శ్రీనివాసాచార్యులు తెలిపారు.

డ్రెయిన్లలో పూడిక తొలగింపు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నిడమానూరులో సమస్యాత్మకంగా మారిన డ్రెయిన్లను ప్రధాన గ్రామంతో పాటు పోరంకి రోడ్డులో గుర్తించి బుధవారం మినీ మిషన్‌తో పూడికతీత పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ప్రకాష్‌నాథ్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు అరికట్టడానికి పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగింపజేసి డంపింగ్‌యార్డ్‌లకు తరలిస్తున్నామని చెప్పారు. మురుగునీరు పారుదలకు ఆటంకంగా మారిన డ్రెయిన్లను గుర్తించి పూడిక తీస్తున్నట్లు పేర్కొన్నారు. కాల్వగట్టు ప్రాంతాల్లో పారిశుద్ధ్యంపై పర్యవేక్షిస్తున్నామన్నారు. గ్రామంలో సురక్షిత తాగునీరు సరఫరా చేసేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ప్రభుత్వ స్థల ఆక్రమణపై చర్యలు తీసుకోండి

కంకిపాడు: ప్రభుత్వ స్థల ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని ఈడుపుగల్లు ఎస్సీ కాలనీ వాసులు పంచాయతీ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన తెలిపారు. ఎస్సీ కాలనీ ప్రధాన సెంటరులో ప్రభుత్వ స్థలం అంటూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు ప్రదేశంలో ఇంటి నిర్మాణ పనులు సాగుతున్నాయని, స్థల ఆక్రమణ జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు పంచాయతీ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందించారు.